

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## వారాంతపు మొగుడు

**"నా మీద ఈ ఇంట్లో ఎవరికీ ప్రేమలేదు. "** ఆక్రోశంగా చెప్పాడు వివేకం.

తండ్రిఫోన్‌లో గేమ్స్ ఆడుతున్న పుత్రరత్నం ఓసారి తలెత్తి చూసి మళ్ళీ ఆటలో మునిగిపోయాడు. ఎండిపోయిన నెయిల్ పాలిష్ సీసాలు ముందు పెట్టుకుని ఒక్కో వేలికి ఒక్కో రంగు వేసుకుంటున్న కూతురి ఏకాగ్రత ఏమాత్రం చెదర్లేదు. ఇక తప్పదన్నట్లుగా చదువుతున్న ఈనాడు పేపర్ని మడుస్తూ అడిగింది విద్య.

"ఏమిటి మీగోల?"

"అదే అదే ఆ నిర్లక్ష్యమే... నామీద ఎవరికీ లక్ష్యం లేదు." ఆక్రోశం దుఃఖంగా మారుతూండగా గద్గదంగా చెప్పాడు వివేకం.

"రజనీకాంత్ సినిమా ఏమైనా చూసారా దూళ్ళపల్లిలో?" జాలిగా అడిగింది విద్య.

"దీన్నే పుండు మీద కారం చల్లడం అంటారు." పళ్ళు పటపట కొరుకుతూ ఉగ్రంగా చెప్పాడు వివేకం.

విసుగ్గా చూసి ఫోన్‌తో సహా లోపలికి వెళ్ళిపోయాడు సుపుత్రుడు, అన్నని బుద్ధిగా అనుసరించింది చెల్లెలు.

పిల్లలు కొంచెం కనుమరుగవగానే భర్త చెంపలు నిమురుతూ అడిగింది విద్య.

"ఏమైంది వివేకం?"

"నా మీద ఈ ఇంట్లో ఎవరికీ ప్రేమలేదు." ఆక్రోశంగా చెప్పాడు వివేకం.

చిన్నప్పటినుంచీ వివేకానికి పెద్దగా కష్టాలు లేవు. అన్నాచెల్లెళ్ళ మధ్య అతని బాల్యం సాధారణంగా గడిచింది. చదువు సామాన్యం. ఇంజనీరింగ్ అవగానే ఓ ప్రముఖ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం వచ్చింది. పెళ్ళి చూపుల్లో విద్య అతనికి నచ్చింది. ఆమె చేసే బేంక్ ఉద్యోగం ఇంకా నచ్చింది. పెళ్ళి కూతురికి బైక్ ఉందని, దానిమీద ఆమె ఝూంఝూం అంటూ ఉద్యోగానికి వెళ్ళి వస్తూంటుందని తెలిసి మరీ మరీ నచ్చింది. ఆమె సమర్ధత మీద నమ్మకం కలిగి పెళ్ళికి తలూపాడు.

పెళ్ళవగానే బాధ్యతలన్నీ భార్యమీద పెట్టేసి వివేకం హాయిగా నిశ్చింతగా కాలం గడపడం మొదలుపెట్టాడు. పన్లో పనిగా పదేళ్ళలో ఇద్దరు పిల్లలకి తండ్రయిపోయాడు. ఇంకా ఓ బుజ్జి ఇల్లు, ఓ బుల్లికారుకి ఓనరైపోయాడు.

ఆనందంగా ఆడుతూ పాడుతూ కాలం గడుపుతున్న వివేకాన్ని చూసి విధికి కన్ను కుట్టింది. ఓ అశుభముహూర్తంలో అతని మేనేజర్ వివేకాన్ని పిలిచి ఇంగ్లీష్‌లో చెప్పాడు.

"మిస్టర్ వివేకానందా. మీరు మన సంస్థకి చేస్తున్న సేవ చూస్తే గర్వంతో నాకు నోటమాట రావడంలేదు."

మనసులో పొంగిపోతున్నా గంభీరంగా మొహం పెట్టి ఓసారి టై సవరించుకుని వినయంగా చెప్పాడు వివేకం. "అది నా బాధ్యత సర్."

"మన కంపెనీ అభివృద్ధి నీలాంటి వాళ్ళే మూలస్థంభాలు మిస్టర్ వివేకానందా! మీ అందరి సహకారంతో మన సంస్థని విస్తరింప చేయాలని బాస్ అనుకుంటున్నారు. ఇక్కడికి నూట ఏభై మైళ్ళ దూరంలో దూళ్ళపల్లి అనే కుగ్రామంలో మన కొత్త ప్లాంట్‌ని ప్రారంభించబోతున్నాం. అక్కడి పనులని ఈ తొలిదశలో నీలాంటి సమర్థుడే నిర్వర్తించగలడు. వచ్చే సోమవారం నుంచి నువ్వు అక్కడినుంచి పని చెయ్. " విలన్ గుమ్మడిలాగా చిరునవ్వుతో చెప్పాడాయన.

వివేకం బుర్ర కాసేపు పనిచేయలేదు. పని చేయడం మొదలు పెట్టాక అయోమయం అయిపోయాడు. తెప్పరిల్లి ప్రశ్నించాడు.

"పిల్లలు.. స్కూళ్ళు.. విద్య.. బాంక్.. ఎద్దులపాడు.. ఎలా?"

ఆ ముక్కలన్నిటినీ సానుభూతిగా అర్థం చేసుకున్న మేనేజర్ అదే చిరునవ్వుతో సమాధానం చెప్పాడు.

"ఎద్దులపాడుకాదు. దూళ్ళపల్లి. పిల్లలికి స్కూలు లేదు. చిన్న అంగన్‌వాడీ మాత్రమే ఉంది. విద్య ఏ బేంకో తెలీదు కానీ దూళ్ళపల్లిలో ఏ బేంకూ లేదు. ఫ్యామిలీని ఇక్కడే వదిలి నువ్వొక్కడివే వెళ్ళి జాయినైపో! ఐదు రోజులు ఎంతలో తిరిగొస్తాయ్ చెప్పు? హాయిగా సోమవారం పొద్దున వెళ్ళావంటే, ఎంచక్కా శుక్రవారం రాత్రికల్లా రావచ్చు."

ఆ రాత్రి విద్య ఒళ్ళో తలదాచుకుని బావురుమన్నాడు వివేకం.

"అయ్యో! ఊరుకోండి. తలని అమ్ముకున్నాక ఏం చేస్తాం చెప్పండి. అక్కడి పరిస్థితులు చక్కబడి ప్లాంట్ సక్సెస్ అవగానే మళ్ళీ వచ్చేయచ్చు." ఓదార్చింది విద్య. కానీ మనసులో మాత్రం ఆమెకి ఆదుర్గాగానే ఉంది. ఈ వెర్రిమొహం అక్కడ ఎలా ఉండగలుగుతాడా అని. ఆ అనుమానం వ్యక్తం చేస్తే వివేకం మరీ బెంబేలెత్తిపోతాడని ఆ రాత్రంతా ధైర్యం చెప్తూనే ఉంది.

మొత్తానికి వివేకం దూళ్ళపల్లిలో వారానికి ఐదురోజులు అశోకవనంలో సీతలా గడిపి శుక్రవారం సాయంత్రం రెక్కలు కట్టుకుని హైదరాబాద్‌లో వాలడం మొదలుపెట్టాడు.

మొదటి శుక్రవారం ఇంటికి రాగానే పిల్లల్ని దగ్గరకి తీసుకుని కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

"అయ్యో! వాళ్ళు బెదిరిపోతారు. ఎందుకా ఏడుపు?" వారించింది విద్య.

"మిమ్మల్ని వదిలి ఐదురోజులు ఎలా ఉన్నానో, మూడేళ్ళూ ఎలా ఉండాలో అర్థంకావడంలేదు" వివేకానికి వెక్కిళ్ళు వచ్చాయి.

పిల్లల్ని తీసుకుని సినిమాకి వెళ్ళారు. బయట తిని ఇంటికి వచ్చేసరికి పదకొండు అవుతోంది.

"ఇంక పడుకుందాం" నీరసంగా చెప్పింది విద్య.

పిల్లలిద్దర్నీ చెరో పక్క పడుకోపెట్టుకుని కథలు చెప్తున్న వివేకం ఆశ్చర్యంగా అడిగాడు.

"అప్పుడేనా? ఇంకా పదకొండు కాలేదుగా?"

"కానీ రేపు నేను బేంక్‌కి వెళ్ళాలి."

"అవును కదూ. ఐనా బేంక్‌లకి కూడా వారానికి ఐదురోజులే పని. రెండురోజులు సెలవలు ఇవ్వాలి" పిడికిళ్ళు బిగించి చెప్పాడు.

"అంతకంటే మీ కంపెనీకి ఆరు రోజులు పని రోజులైతే బావుంటుందిగా?" నవ్వింది విద్య.

శనివారం ఉదయం పిల్లలు స్కూలుకి, విద్య బేంక్‌కి వెళ్ళాక వివేకానికి ఏమీ తోచలేదు. ఇదివరకు తను ఏం చేసేవాడా? అని ఆలోచించి కారుని శుభ్రంగా కడిగి తుడిచాడు. తర్వాత మార్కెట్‌కి వెళ్ళి కూరగాయలు తెచ్చి ఫ్రిజ్‌లో సర్దాడు. భోజనం చేసి పాతమిత్రులని కలవడానికి వెళ్ళాడు. ఐతే కొందరు మిత్రులు వివేకంతో పాటుగా దూళ్ళపల్లి బదిలీ అయిన వాళ్ళు కావడంతో వాళ్ళు తమ ఫేమిలీతో గడుపుతున్నారు. ఇక్కడే ఉన్న మరికొందరు వివేకంని నిరాసక్తంగా ఆహ్వానించారు. కారణం - ప్రస్తుతం అతను తమతో పనిచేయడం లేదు కాబట్టి ఆఫీస్ కబుర్లు, పుకార్లు ఆసక్తిగా పంచుకోలేకపోవడమే.

విసుగేసి ఇంటికి వచ్చి కొద్దిసేపు నడుం వాల్చి లేచి చూసేసరికి టైం ఐదయింది. పిల్లలు వచ్చి హోం వర్క్ చేసుకుంటున్నారు. అతని పితృహృదయం ప్రేమతో ఉప్పొంగిపోయింది.

"ఏమన్నా తిన్నారా చిట్టి తండ్రులూ?" వాళ్ళని ముద్దాడాడు.

"అబ్బ.. ఉండు నాన్నా!. హేండ్ రైటింగ్ సరిగ్గా లేకపోతే టీచర్ తిడతారు" కొడుకు విసుక్కున్నాడు.

"తిన్నాంలే నాన్నా. అమ్మ టిఫిన్ టేబుల్ మీద పెట్టి వెళ్ళింది" కూతురు చెప్పింది.

ఓసారి టైం చూసుకుని 'ఇప్పుడే వస్తాను జాగ్రత్తగా ఉండండి' అని చెప్పి కారేసుకుని విద్య పనిచేసే బేంక్‌కి వెళ్ళాడు.

అప్పుడే కంప్యూటర్ ఆఫ్ చేసి సీట్లోంచి లేస్తున్న విద్య పెద్ద పెద్ద అంగలతో బేంక్‌లోకి వస్తున్న వివేకాన్ని చూసి హడలిపోయింది.

"ఏమైంది? పిల్లలు స్కూలు నుంచి వచ్చారా?" గాభరాగా అడిగింది.

"నా బంగారు కొండలు హాయిగా హోం వర్క్ చేసుకుంటున్నారు." మురిపెంగా చెప్పాడు.

"మీరెందుకు ఇక్కడికి వచ్చారు?" అనుమానంగా అడిగింది.

"ఏం లేదు విద్యా. నువ్వు నా రాకని ఎక్స్‌పెక్ట్ చేయవుకదా? ఇలా నేను నీకోసం వచ్చానంటే నీకెంత బావుంటుంది చెప్పు? హౌ రొమాంటిక్ అని అనిపించటంలేదు" ఆమెతో బయటకి వస్తూ సరసంగా అడిగాడు వివేకం.

"హుం" దీర్ఘంగా నిట్టూర్చింది విద్య.

"సరే. కానీ నా బైక్‌ని ఏం చేయను? డిక్కీలో పట్టదేమో?" అడిగింది.

"అయ్యో! దాని గురించి అసలు ఆలోచించలేదు. సారీ విద్యా." సిగ్గుపడ్డాడు వివేకం.

ముందు విద్య బైక్ మీద వెళ్తూంటే, వెనక కారులో ఆమెని అనుసరించాడు. అలసటగా మంచినీళ్ళ సీసా తీసుకోడానికి విద్య ఫ్రిజ్ తలుపు తెరిస్తే, వినాయకుడి బొజ్జలోంచి ఉండ్రాళ్ళు దొర్లినట్లుగా ఫ్రిజ్ లోంచి దొర్లినట్లుగా ఫ్రిజ్‌లోంచి దోసకాయలు, సొరకాయలు, వంకాయలు ఇలా ఓ రైతు బజార్‌కి సరిపడా కూరగాయలు బయటకి దొర్లి ఇల్లంతా పరచుకున్నాయి.

నీరసంగా నేలమీద కూలబడి అడిగింది.

"ఏంటండీ ఇవన్నీ?"

"కూరలు విద్యా. క్రిస్పర్‌లో అన్నీ సరిపోలేదు. ఎలాగో కుక్కేసాను. కాకపోతే నువ్వు సరిగ్గా చూసుకోకుండా డోర్ తీసావు. దాంతో అన్నీ బయటకి దొర్లాయి." తన తప్పేం లేదన్నట్లుగా చెప్పాడు.

"మీరు ఉండటంలేదు. నేనూ పిల్లలు. వాళ్ళెంత తింటారో మీకు తెలుసు. నేనొక్కదాన్ని ఇవన్నీ ఎన్నిరోజులు తినాలి? ఇంక పాలు పెరుగు వండిన కూరలు ఇవన్నీ ఎక్కడ పెట్టాలి? అసలు మిమ్మల్ని మార్కెట్‌కి వెళ్ళమని నేను చెప్పానా?" అరిచింది.

చిన్నబుచ్చుకుని సోఫాలో కూర్చున్నాడు వివేకం. పిల్లలు తల్లికి సహాయంగా వాటన్నిటినీ ఏరి కుప్పపోసారు.. విద్య కవర్లు తీసుకుని ఆ కూరగాయలు రకానికి నాలుగైదు చొప్పున వేసి చుట్టుపక్కల ఇళ్ళల్లో ఇచ్చి రమ్మని పిల్లల్ని పంపింది.

"దూళ్ళపల్లి నుంచి తెచ్చారా మీనాన్న? చాలా తాజాగా ఉన్నాయి. ప్రతీవారం తెమ్మని చెప్పు" అన్నారమ్మా పక్కింటి ఆంటీవాళ్ళు. కూతురు చెప్పింది.

కొడుకు వచ్చి అవే మాటలు అటూ ఇటుగా చెప్పాడు. భర్తని ఉరిమి చూసింది విద్య.

కోడికూతలు, గేదల అరుపులు, పక్షుల కిలకిలారావాలు లేకపోవడంతో వివేకానికి ఐదున్నరకల్లా మెలుకువ వచ్చేసింది. 'ఏంటీ ఇంత నిశ్శబ్దంగా ఉంది అసహ్యంగా' అనుకున్నాడు. పక్కకి తిరిగి చూస్తే ఆదమరిచి నిద్రపోతున్న విద్యమొహం ముద్దొచ్చింది. 'తను లేకపోయినా పిల్లల్ని, ఇంటిని, ఉద్యోగాన్ని నిభాయిస్తుంది పాపం' అని గుర్తురాగానే ప్రేమపొంగి పొర్లిపోయింది. ఆ విషయం ఆమెకి చెప్పడం మర్చిపోతాడేమో అని భయం వేసి పాలు, పంచదార, తేనె అన్నీ రంగరించినట్లుగా గొంతులో మార్దవాన్ని నింపుకుని నెమ్మదిగా పిలిచాడు.

"విద్యా"

అయితే ఆ పిలుపు విద్యకి ఊపిరాడని వాడు బలహీనంగా పిలినట్లు, గొంతు పిసుకుతుంటే కీచుగా అరిచినట్లు వినిపించి ఒక్క ఉదుటున లేచి కూర్చుని కంగారుగా అడిగింది.

"ఏమైంది? ఒంట్లో బాలేదా?"

"విద్యా ఐలవ్ యూ. ఈ మాటలు చెప్పడం మర్చిపోయానేమో అని వెంటనే చెప్పేయాలని పిలిచా" అత్యంత సౌమ్యంగా శృంగారభరితంగా చెప్పాడు వివేకం.

"ఏమిటి?" నిద్రమత్తులో అర్థంకాని విద్య అయోమయంగా అడిగింది.

"అంటే, నువ్వు పాపం నేను లేకపోయినా ఇల్లు, పిల్లలు, ఉద్యోగం అన్నీ నిభాయించుకుని వస్తున్నావుకదా! అది తలచుకుంటే నీమీద అవ్యాజమైన ప్రేమ కలిగింది విద్యా. ఆ విషయం వెంటన్నే చెపితే నువ్వు సంతోషిస్తావని.." సిగ్గుపడ్డాడు వివేకం.

అతని వంక నిశితంగా చూసింది విద్య. ఆమె నిద్రమత్తు ఎగిరిపోయింది.

"మీరున్నా అవన్నీ చేసేది నేనేకదా?" అడిగింది.

"నిజమే అనుకో" నీళ్ళు నమిలాడు వివేకం.

"అవ్యాజమైన అంటే ఏమిటి?"

"ఏమో మరి, పుస్తకాల్లో రాస్తారుగా?" తన అజ్ఞానాన్ని ఒప్పుకున్నాడు.

లేచి పిల్లల గదిలోకి వెళ్ళి పడుకుంది విద్య. తన మాటలకి సంతోషించి, ఎగిరి గంతేసి 'నేను ఎంత అదృష్టవంతురాలిని వివేక్. మీ ప్రేమని పొందగలిగాను' అంటుందనుకున్న విద్య అలా లేచి వెళ్ళిపోవడంతో పుస్తకాల భాషలో ఖిన్నుడైన వివేకం కోపంగా నిద్రపోయాడు.

మళ్ళీ ఏడుగంటలకి మెలుకువ వచ్చిన వివేకం పిల్లల గదిలోకి తొంగి చూసాడు. ముగ్గురూ ఆదమరిచి నిద్రపోతున్నారు. ఏం చెయ్యాలో తోచక టీ.వీ పెట్టుకుని కొద్దిసేపు ప్రవచనాలు చూసాడు. ఒక్కముక్కా అర్థం కాక పోవడంతో ఎమ్.టి.వి పెట్టుకుని రిధమిక్‌గా బ్రషింగ్ చేసుకుని బాత్‌రూం లోంచి బయటకి వచ్చేసరికి నడుం మీద చేతులు పెట్టుకుని కొరకొరా చూసే కుటుంబ సభ్యులు కనిపించారు.

"ఏమిటి? ఎందుకలా చూస్తున్నారు?" అమాయకంగా ప్రశ్నించాడు.

"ఆ సౌండ్ ఏమిటి నాన్నా? నువ్వు లేస్తే ఇంట్లో అందరూ లేవాలా?" కొడుకు అరిచాడు.

"నీకు నిద్రపట్టదు. మేము పడుకుంటే నీకు కుళ్ళు." కూతురు కోపంగా చెప్పింది.

"నేను మిమ్మల్ని లేపలేదుగా బంగారం?" నచ్చ చెప్పబోయాడు.

"అంటే టి.వి అంత పెద్దగా మోగుతూంటే, రైల్వే స్టేషన్‌లో పడుకున్నట్లు పడుకోవాలా? బుద్దిలేకపోతే సరి."

విద్యకూడా తనని అపార్థం చేసుకోవడంతో హృదయం బద్దలైన వివేకం పదిగంటలదాకా ఈనాడు పేపర్ చదివాడు. టీపాయ్ మీద విసురుగా పెట్టబడ్డ కాఫీని పూర్తిగా తాగాడు. ఇడ్లీలు సుష్టుగా తిని రెండోసారి కాఫీ కూడా తాగాక బెట్టు వదిలేసి మళ్ళీ విద్య వెనక చేరి సతాయింపు మొదలు పెట్టాడు.

"కొత్తగా ఏమిటండీ ఇది? ఇదివరకు మీ పన్లో మీరుండేవారు. నేను నా పనులు చేసుకునేదాన్ని. ఇప్పుడేంటి ఇలా వెనకపడ్డారు? - నా పనులు సక్రమంగా చేసుకోనివ్వరా?" సతాయింపు శృతిమించడంతో విసుగ్గా అంది.

"సాయంత్రం వెళ్ళిపోవాలిగా విద్యా మరో ఐదురోజులు వనవాసం నాకు" దిగులుగా చెప్పాడు.

"కదా? మీరు బుద్దిగా స్నానం చేసి బోలెడు సౌండ్‌తో టి.వి చూస్తూండండి. నేను చకచకా పని చేసుకుంటాను. అప్పుడు మీతో బోలెడు టైం గడపచ్చు. మా బుజ్జి కదూ! వంటింట్లోంచి వెళ్ళండి ప్లీజ్."

ఆ అభ్యర్థనని మన్నించి బయటకి వచ్చిన వివేకం పిల్లలగదిలో దూరి బిల్డింగ్ బ్లాక్స్‌తో ఇల్లుకట్టుకుంటున్న వాళ్ళ దగ్గరకి వెళ్ళి అప్పటికే సగం కట్టిన వాటిని విడదీస్తూ చెప్పాడు.

"వాస్తు ప్రకారం కిటికీ ఈ పక్క ఉండకూడదు. ఇటువైపు ఉండాలి. " అతను దాదాపు అరగంట ప్రయత్నించి, తుఫానులో వంగిపోయిన ములగ చెట్టులాంటి ఓ  సన్నటి కట్టడాన్ని నిర్మించాడు.

విశ్వకర్మ, యముడు కూడా తన ముందు బలాదూర్ అనుకుంటూ మురిసిపోతుండగా పిల్లల ఏడుపు చెవులకి సోకింది.

"అమ్మా! నాన్న చూడు మా ఇల్లు పడగొట్టి ఏదో పుల్ల కట్టాడు"

"పుల్ల కాదురా స్థంభం" కూతురు సరిదిద్దింది.

తలబాదుకుంది విద్య.

రెండో శుక్రవారం ఇంటికి వచ్చిన వివేకానికి యధాప్రకారం శనివారం ఏమీ తోచలేదు. కానీ ఫ్రెండ్స్, రైతుబజార్, బేంక్‌కి వెళ్ళదల్చుకోలేదు. పాపం విద్యకి కోపం తెప్పించాను. ఈసారి విద్యనిని మెప్పించాలి అనుకున్నాడు.

ఆ సాయంత్రం విద్య బేంక్ నుంచి వచ్చేసరికి పిల్లలిద్దరూ గుమ్మంలోనే కూర్చుని ఎదురుచూస్తూ కనిపించారు.

"మీ నాన్నేమైనా పిచ్చి పనులు చేసారా?" అనుమానంగా అడిగింది.

"ఓసారి కిచెన్‌లోకి వెళ్ళి చూడు." గంభీరంగా చెప్పాడు కొడుకు.

అదిరే గుండెలతో వంటగదిలోకి వెళ్ళింది విద్య. నేల మీదంతా పేపర్లు పరిచి ఉన్నాయి. వాటిమీద ఆవాలు, ధనియాలు, జీలకర్ర, మెతులు ఇలాంటి వంట పదార్థాలన్నీ పోసి ఉన్నాయి. ఖాళీ డబ్బాలతో వివేకం కుస్తీ పడుతున్నాడు. మొదట ఓ సీసాలో మినపప్పు పోసి, కొద్దిగా ఖాళీ మిగిలితే దాన్ని మళ్ళీ ఓ పేపర్ మీద కుమ్మరించి, శనగపప్పు పోసి అది నిండిపోయి ఇంకా పప్పు మిగిలిపోతే దాన్ని కుమ్మరించి ఇంకోటి అందుకుని...

"ఏమిటి ఇదంతా?" అరిచింది.

తలపైకెత్తి చూసి వివేకం అలసటగా చెప్పాడు.

"అయ్యో! నువ్వు వచ్చేసావా! నువ్వు వచ్చేలోగా ఇవన్నీ సర్దాలనుకున్నా కానీ టైం సరిపోలేదు."

"సరిగ్గానే ఉన్నాయిగా? సర్దడం ఏమిటి మళ్ళీ?"

"కొన్ని సీసాల్లో తక్కువ, కొన్ని సీసాల్లో ఎక్కువ ఉన్నాయి. సరిగ్గా ఎక్కడు ఉన్నాయి? అన్నీ సమానంగా ఉంటే ఎంత అందంగా ఉంటుంది? అందుకని తక్కువ ఉన్నది చిన్న సీసాల్లో, ఎక్కువ ఉన్నవి పెద్ద సీసాలో పోస్తున్నాను. పోనీ నువ్వు సర్దుకుంటావా?" అప్పటికి విసుగు పుట్టడంతో ఆశగా అడిగాడు.

"లేదు. మొదలు పెట్టారుగా మీరేపూర్తి చేయండి." హాల్లోకి వచ్చి పేపర్ అందుకుంది.

పిల్లల వంక చూసాడు. కానీ వాళ్ళూ తల్లి వెనకే వెళ్ళిపోయారు. 'హూం' హుంకరించి ఇష్టం వచ్చిన సీసాలో ఇష్టం వచ్చినట్లుగా వాటిని నింపి, పేపర్లు తీసేసి, కిందపోయిన వాటిని ఓమూలకి ఊడ్చేసి ఆవేశంగా వచ్చి చెప్పాడు

"ఈ ఇంట్లో ఎవరికీ నామీద ప్రేమలేదు."

ఆరు నెలలు గడిచాయి. శుక్రవారం వస్తోందంటే విద్యకి వణుకు పుడుతోంది. పిల్లలు బెంబేలెత్తిపోతున్నారు. చిన్నప్పుడు భర్త అనగానే హుందాగా ఉండేవాడని ఊహించుకుంది కానీ ఇలా వెర్రి పనులు చేసి తిట్లు తినేవాడిని చూస్తే దుఃఖం వస్తోంది. ఓసారి కోపం వచ్చినప్పుడు నోరు జారి 'మీ అమ్మ మీకు వివేకానంద పేరు ఎలా పెట్టారు?' అందని అలిగి ఓ శుక్రవారం రాలేదు. దాంతో ఎంత కోపం వచ్చినా అణచుకుని బి.పి తెచ్చుకుంది విద్య.

ఓ శుభ శుక్రవారం రోజు ఆనందంగా ఇంట్లో అడుగుపెట్టిన వివేకానికి ఇంట్లో భార్య, పిల్లలు కనపడగానే ఆనందం రెట్టింపైంది.

"ఏంటీ అంతా ఇంట్లోనే ఉన్నారు? ఇవాళ నేను ముందే వస్తానని మీకెలా తెలుసు?" అడిగాడు.

"మేం స్కూల్‌కి వెళ్ళలేదు నాన్నా. టి.సి తీసుకున్నాం." సుపుత్రుడు చెప్పాడు.

"టి.సినా? ఏం చేసారు అంత అపరాధం?" తండ్రి మనసు తల్లడిల్లింది.

"మేము ఊరెళ్తున్నాం నాన్నా" పుత్రిక ఉత్సాహంగా చెప్పింది.

"ఊరా?" తెల్లబోయాడు వివేకం.

"అవునండీ. నాకు అహ్మదాబాద్ ట్రాన్స్‌ఫర్ అయింది. సోమవారం జాయిన్ అవాలి. ఇక్కడ రిలీవ్ అయిపోయాను." విద్య నెమ్మదిగా చెప్పింది.

"ట్రాన్స్‌ఫరా? అహ్మదాబాదా? రోజూ ఫోన్ చేసి ఏంటి విశేషాలు అంటే ఏమీలేవు అంటావుగా? నాకెందుకు చెప్పలేదు?" వివేకానికి కోపం వచ్చింది.

"విషయం తెలిసి మీరొక్కరే దూళ్ళపల్లిలో వంటరిగా బాధపడతారు. రేపు ఈవినింగ్ ఫ్లయిట్‌లో వెళ్తున్నాం. మన ఇల్లు అద్దెకి ఇచ్చేసాను. సామాను నిన్న వెళ్ళిపోయింది. కారు మీరు తీసుకువెళ్ళండి."

ఇల్లంతా చూసాడు వివేకం. బోసిగా కనపడింది.

"ఇంత పనీ నువ్వొక్కదానివే చేసావా విద్యా?"

"అవునండీ. నేను సమర్ధవంతురాల్ని అంటారుగా? అహ్మదాబాద్ బాగా దూరం. గుజరాత్. పాపం మీరు ప్రతీ శుక్రవారం రాలేరు. నెలకొక్కసారి వస్తూండండి. మీ దూళ్ళపల్లి ప్లాంట్ పని అవగానే నేనూ రిక్వెస్ట్ చేసి ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటా. మళ్ళీ మనం మనింట్లో హాయిగా ఉండచ్చు." విద్య హృదయంలోంచి వచ్చిన బాధతో చెప్పింది.

బిక్క మొహం వేసి చూస్తున్న వివేకాన్ని చూస్తే తన పిల్లలకన్నా పసివాడు అనిపించి పిల్లలు అక్కడే ఉన్నా దగ్గరకి తీసుకుంది విద్య. బావురుమంటూ ఆమెని అల్లుకుపోయాడు వివేకం.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments on this story